TGTEL/26/A5513

వార్తదీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 59 | 13 ఆదివారం సెప్టెంబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 12వార్త దీపిక న్యూస్ :

తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికంది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. మ వమా బాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపి స్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారా యణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

కేసీఆర్ నా సూచనలు పట్టించుకోలేదు.. రేవంత్ రెడ్డి ఆ తప్పు చేయకూడదు: రాజాసింగ్

- హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీ చేయడానికి నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతించిన రాజాసింగ్
- నిధుల వినియోగంలో స్థానిక ఎమ్మెల్యేలను భాగస్వాములు చేయాలని విన్నపం
- ముందుగా బస్తీలు, గల్లీల్లో ప్రాథమిక సమస్యలు తీరాలని సూచన



తెలంగాణ శాసనసభలో 'కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు' పై జరిగిన చర్చ సందర్భంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారుల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలో ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేసిన ఆయన... శాసనసభ్యులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లేదా ప్రజా సమస్యలపై సూచనలు చేసినా కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ...మిగతా 2 లో...

ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో లక్షల ఎకరాల అక్రమాలు
- ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు
- దివాలా తీసిన విదేశీ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు
- బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు
- పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది
- అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22-ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ...మిగతా 2 లో...

ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి: కిషన్ రెడ్డి

- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి
- ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి




ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ...మిగతా 2 లో...



ఢిల్లీ బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, జిన్‌పింగ్

కీలక భేటీ...

- ఢిల్లీ బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, జిన్‌పింగ్ భేటీ
- ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు
- బ్రిక్స్ అధ్యక్ష పదవికి సహకరించినందుకు చైనాకు మోదీ ధన్యవాదాలు
- గల్వాన్ ఘర్షణల తర్వాత సంబంధాల బలోపేతమే లక్ష్యంగా సమావేశం



ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల మధ్య శనివారం ఢిల్లీలో కీలక భేటీ జరిగింది. 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో భారత్ మండపంలో వీరిద్దరూ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను పునరుద్ధరించి, బలోపేతం చేసే దిశగా ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.సమావేశం ప్రారంభంలో ప్రధాని మోదీ, షీ జిన్‌పింగ్‌కు సాదరంగా స్వాగతం పలికారు. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలకు చైనా అందించిన మద్దతుపై ఈ సందర్భంగా మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. "మీకు స్వాగతం పలకడం సంతోషంగా ఉంది. బ్రిక్స్ సదస్సులో మీ సానుకూల వైఖరికి ధన్యవాదాలు. ద్వైపాక్షిక సహకారంపై చర్చించేందుకు మనకు ఇప్పుడు మంచి అవకాశం లభించింది" అని మోదీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా పాల్గొన్నారు. ...మిగతా 2 లో...

పహల్గాం దాడిపై బ్రిక్స్ దేశాల తీవ్ర ఖండన..

ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్...

- పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన బ్రిక్స్ దేశాలు
- ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని పునరుద్ఘాటించిన కూటమి
- న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో ఉగ్రవాదంపై కీలక తీర్మానం ఆమోదం
- ఉగ్రవాదాన్ని ఏ మతానికీ, జాతికీ ముడిపెట్టొద్దని స్పష్టం
- ఉగ్రవాదులకు, వారి మద్దతుదారులకు అండగా నిలవొద్దని పిలుపు

"న్యూఢిల్లీ వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో సభ్య దేశాలు ఉగ్రవాదంపై కీలక తీర్మానం చేశాయి. 2025లో జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిని ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదం 'ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం' అనే విధానానికే తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. ఈ మేరకు సెప్టెంబర్ 12న ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్'లో తమ నిర్ణయాన్ని స్పష్టం చేశాయి. 2025 ఏప్రిల్ 22న పహల్గాంపై జరిగిన ఉగ్రదాడిని అత్యంత కఠిన పదజాలంతో ఖండిస్తున్నట్లు బ్రిక్స్ నేతలు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం, పలువురు గాయపడటం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాద చర్యలు ఎక్కడ, ఎప్పుడు, ఎవరు, ఏ కారణంతో చేపట్టినా అవి నేరపూరితమైనవేనని, ఏమాత్రం సమర్థనీయం కావని తేల్చిచెప్పారు. సరిహద్దులు దాటి సాగే ఉగ్రవాదుల కదలికలు, ఉగ్రవాదానికి నిధులు సరఫరా, వారికి సురక్షిత ఆశ్రయాలు కల్పించడం వంటి అన్ని రూపాల్లోని ఉగ్రవాదంపై ఉమ్మడిగా పోరాడతామని బ్రిక్స్ దేశాలు ప్రతిజ్ఞ చేశాయి.

...మిగతా 2 లో...

చేతులు కలిపిన...

వినాయక మండపాలకు

ఉచిత విద్యుత్...

- గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి
- మండపాల నిర్వహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన
- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం



వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులే కుండా, వైభవంగా నిర్వహిం చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదు రయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయ ంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యే కంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ నదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ...మిగతా 2 లో...

మోదీ, పుతిన్, జిన్‌పింగ్.. వైరల్ అవుతున్న ఫోటో



భారత ఆతిథ్యమిస్తున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఒక ఆసక్తికర సన్నివేశం అందరి దృష్టిని ఆకర్షించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో కలిసి ఉన్న ఒక ఫొటోను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. "ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు 2026 ప్రారంభమైంది" అనే క్యాప్షన్‌తో ఆయన ఈ పోస్ట్ చేశారు.న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముగ్గురు అగ్రనేతలు ఎంతో స్నేహపూర్వకంగా కనిపించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటిస్తుండటం గమనార్హం. ఆయన శనివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచ గమనాన్ని నిర్దేశించడంలో గ్లోబల్ సౌత్ దేశాలు ఇకపై వెనుకవరుసకే పరిమితం కాకుండా, నిర్ణయాధికారాల్లో కీలక భాగస్వాములు కావాలని ప్రధాని మోదీ తన ప్రారంభోపన్యాసంలో పిలుపునిచ్చారు. వివిధ అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ, శనివారం తెల్లవారుజాము వరకు జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు బ్రిక్స్ దేశాధినేతలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

-

ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రత్యేక దృశ్యం

- రష్యా, చైనా అధ్యక్షులతో చేతులు కలిపిన ప్రధాని మోదీ
- ఏడేళ్ల తర్వాత భారత్‌లో పర్యటిస్తున్న జిన్‌పింగ్
- 'న్యూఢిల్లీ డిక్లరేషన్' ఆమోదించిన బ్రిక్స్ దేశాలు
- గ్లోబల్ సౌత్ పాత్ర పెరగాలని పిలుపునిచ్చిన మోదీ

TGTEL/26/A5513 వార్త దీపిక

పర్యావరణ సంరక్షణ కోసం మట్టి వినాయకులను పూజిద్దాం

-తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజనీ రవిందర్ గౌడ్,వైస్ చైర్మన్ సమత కాశీ రెడ్డి

వార్త దీపిక న్యూస్ : -

వినాయక చవితి పండుగ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవిందర్ గౌడ్ వైస్ చైర్మన్ కొక్కొండ సమత కాశీ రెడ్డి మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రజనీ రవిందర్ గౌడ్ వైస్ చైర్మన్ సమత కాశీ రెడ్డిలు మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్టించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అలాగే ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో సామరస్య పూర్వకంగా పండుగను జరుపుకోవాలని సూచించారు.రంగుల విగ్రహాలను ఏర్పాటు చేయడం వల్ల రసాయనాలతో నీరు కలుషితమై దీని వల్ల వచ్చే అనర్థాలను స్థానిక ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా తూప్రాన్ మున్సిపల్ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపాలిటీ సిబ్బంది మెప్మా సిబ్బంది ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





కేసీఆర్ నా సూచనలు పట్టించుకోలేదు.. రేవంత్ రెడ్డి ఆ తప్పు చేయకూడదు: రాజాసింగ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది నిధులు మంజూరు చేయడం ఆహ్వానించదగిన పరిణామమే అయినప్పటికీ... ఆ నిధుల వినియోగంలో స్థానిక ఎమ్మెల్యేలకు తగిన భాగస్వామ్యం కల్పించాలని కోరారు.గత బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ కూడా హైదరాబాద్‌ను గొప్పగా అభివృద్ధి చేయాలని భావించినప్పటికీ... హైదరాబాద్ ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశాలు పెట్టాలని తాను ఇచ్చిన సూచనలను ఆయన పట్టించుకోలేదని రాజాసింగ్ గుర్తుచేశారు. ఇప్పుడైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ తప్పు చేయకుండా, నగర పరిధిలోని ఎమ్మెల్యేలందరితో కలిసి ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకోవాలని కోరారు.హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయికి చేరాలంటే ముందుగా బస్తీలు, గల్లీలలో ఉన్న ప్రాథమిక సమస్యలు తీరాలని రాజాసింగ్ పేర్కొన్నారు. నగరంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల మధ్య తీవ్ర అస్తవ్యస్త పరిస్థితి నెలకొందని... మంచినీటి సరఫరా ప్రారంభమైన మొదటి 30 నిమిషాలు మురికి నీరే వస్తోందని సభ దృష్టికి తెచ్చారు. కొన్ని ప్రాంతాలలో అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున 3, 4 గంటలకు నీరు విడుదల చేస్తుండటంతో ప్రజలు నిద్రలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తగినంత రవాణా, డ్రైనేజీ సదుపాయాలు ఉన్నాయో లేదో పరిశీలించకుండానే బహుళ అంతస్తుల (హైరైజ్) భవనాలకు అనుమతులు ఇవ్వడం వల్ల సమస్య మరింత సంక్లిష్టంగా మారుతోందని విమర్శించారు.

ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ

వార్త దీపిక న్యూస్ : :

ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరోజు ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఎఎఫ్) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

మనోహరాబాద్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షునిగా మేడ్చల్ రామస్వామి ఎన్నిక.

వార్త దీపిక న్యూస్ :

మనోహరాబాద్ మండల ఎస్సీ సెల్ చైర్మన్ గా మేడ్చల్ రామస్వామి అధికారికంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే సత్యనారాయణ ఆదేశాల మేరకు అధికారికంగా ప్రకటించారు. వీరితోపాటు తూప్రాన్ టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా సర్గల వినీత్ కుమార్ ఎన్నికయ్యారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని మనోహ రెస్టారెంట్ వద్ద వీరి ఇరువురికి అధికారికంగా నియామక పత్రాన్ని రాష్ట్ర నాయకులు చిటుకుల మహిపాల్ రెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్ కొమ్ము విజయ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ తాడేపు మహేందర్ ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ మాకు ఇచ్చిన ఈ పదవిని సొంత లాభాపేక్ష కోసం కాకుండా పార్టీకి అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, తూప్రాన్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షులు గరిగే నరసింగారావు, అధికార ప్రతినిధి సత్యనారాయణ, నాయకులు చిట్టి మిల్ల అనిల్, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల నరసింహ, టేక్మాల్ వెంకట్ రెడ్డి, నాగరాజు గౌడ్, మైనార్టీ అధ్యక్షులు జావేద్ పాషా, వెన్నెల్లి కృష్ణ, బక్క శ్రీనివాస్, వి. వెంకట్ రెడ్డి, ఎస్. కిట్టు, రేకల నయాందాస్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి

-గణేశ్ నవరాత్రుల సందర్భంగా తూప్రాన్ లో శాంతి కమిటీ సమావేశం

-ముఖ్య అతిథిగా పలు సూచనలు చేసిన తూప్రాన్ డీఎస్పీ నరెందర్ గౌడ్

వార్త దీపిక న్యూస్ :

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ఈరోజు తూప్రాన్ పట్టణంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ...గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.శాంతి భద్రతలు,మత సామరస్యం,ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు మరియు ఇతర శాఖల అధికారులకు సహకరించాలని కోరారు.ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొంది రజనీ రవిందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్,ఎంఆర్వో చంద్రశేఖర్ రెడ్డి,విద్యుత్ శాఖ అధికారులు ఏఈ వెంకటేశ్వరరావు మున్సిపల్ వైస్ చైర్మన్ సమత కాశీ రెడ్డి,కౌన్సిలర్లు రాథోడ్ జైపాల్ నాయక్,బైరం సత్యలింగం,చెలిమెల రాములు, అన్నపూర్ణ నారాయణ గుప్త , సబిత నాగేష్, ఐలేష్ యాదవ్,బొడ్డు రాధా శ్రీనివాస్,చంద అశోక్,మన్నె స్వామి,సత్యనారాయణ,స్వప్న నాగరాజు గౌడ్, జ్యోత్స్న వేణు, వినాయక మండపం కమిటీ సభ్యులు ప్రభుత్వ అధికారులు , పోలీస్ మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫుట్ పాస్, జాతీయ రహదారి అక్రమదారులపై-

పోలీసులు, మున్సిపల్ అధికారులు మెరుపు దాడి

ఇక మీదట ఫుట్ పాస్ ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తే కేసులు నమోదు

వార్త దీపిక న్యూస్ :

తూప్రాన్ మున్సిపల్ ఆక్రమంగా ఫుట్పాస్, జాతీయ రహదారిని ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్న ఆక్రమాణదారులపై పోలీసులు, మున్సిపల్ కమిషనర్ మెరుపు దాడి నిర్వహించారు. ఫుట్పాస్ ను ఆక్రమిస్తే ఇకపైన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ అన్నారు. జాతీయ రహదారిని ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తే ట్రాఫిక్ అంతరాయానికి ఆటంకం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్...

మొదటిపేజీ తరువాయి

ఉగ్రవాద నిరోధక చర్యల్లో ద్వంద్వ ప్రమాణాలను పూర్తిగా తిరస్కరిస్తున్నట్లు డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఉగ్రవాదాన్ని ఏ మతానికీ, జాతీయతకూ, నాగరికతకూ లేదా నిర్దిష్ట జాతి సమూహానికీ ముడిపెట్టకూడదని నేతలు పిలుపునిచ్చారు. ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడేవారిని, వారికి మద్దతునిచ్చే వారిని జాతీయ, అంతర్జాతీయ చట్టాల ప్రకారం బాధ్యులను చేసి, న్యాయస్థానం ముందు నిలబెట్టాలని కోరారు. ముఖ్యంగా యువతలో పొంచి ఉన్న తీవ్రవాదాన్ని, రాడికలైజేషన్‌ను ఎదుర్కోవడానికి సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని నొక్కిచెప్పారు. అయితే, ఈ దాడి వెనుక ఏ దేశపు మద్దతు ఉందనే విషయాన్ని ఈ డిక్లరేషన్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. గతంలో 2025 బ్రిక్స్ రియో డిక్లరేషన్‌లోనూ, టియాంజిన్‌లో జరిగిన ఎస్సీఓ సదస్సులోనూ పహల్గాం ఘటనపై ఇదే తరహాలో ఖండన తీర్మానాలు వెలువడటం గమనార్హం.

ఢిల్లీ బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, జిన్‌పింగ్

కీలక భేటీ...

మొదటిపేజీ తరువాయి

ఈ భేటీకి ముందు ఇరు నేతల మధ్య స్నేహపూర్వక వాతావరణం కనిపించింది. భారత్ మండపంలో ప్రధాని మోదీ, జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లు పరస్పరం కరచాలనం చేస్తూ చిరునవ్వుతో కనిపించారు. అంతకుముందు, బ్రిక్స్ నేతలకు స్వాగతం పలికే వేదిక వద్ద ఏర్పాటు చేసిన రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయ చిత్రం నేపథ్యం గురించి ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడికి క్లుప్తంగా వివరించారు.2020లో గల్వాన్ లోయ ఘర్షణల తర్వాత భారత్–చైనా సంబంధాల దెబ్బతిన్న నేపథ్యంలో, వాటిని తిరిగి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలు నెలకొనడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి అత్యంత కీలకమని భారత్ పలుమార్లు స్పష్టం చేసింది. ఇరు దేశాల నేతల వ్యూహాత్మక మార్గదర్శకత్వంలో కలిసి పనిచేస్తామని చైనా రాయబారి కూడా శుక్రవారం వ్యాఖ్యానించారు.అంతకుముందు, బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీ చేరుకున్న జీ జిన్‌పింగ్‌కు విమానాశ్రయంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఘన స్వాగతం పలికారు.

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్...

మొదటిపేజీ తరువాయి

చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... “మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి” అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు.“హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది” అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి: కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జేఖూ) అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు.గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఎఎఫ్) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు.పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

TGTEL/26/A5513 వార్త దీపిక

శ్రీ శ్రీ శ్రీ జీవన్ముక్త కాశీనాథ్ మహారాజ్ సంస్థానం

మునిపల్లి, సెప్టెంబర్ 12, వార్త దీపిక న్యూస్ :

శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న సప్త భజన కార్యక్రమం ముగింపు సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు.
ఈ పవిత్ర కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పైతర సాయికుమార్ తాజా మాజీ జడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ స్థానిక మండల నాయకులతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఠలేశ్వరుని అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆ స్వామి ఆశీస్సులతో అందరు సుఖ సంతోషాలతో ఉండాలని
పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆ స్వామి వారిని వేడుకోనైనదని వారన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, మంతుర్ శశి కుమార్, అంతారం సంగ్రామ్ పటేల్, సర్పంచులు మల్ల రెడ్డి పేట రాజు మల్లికార్జున పల్లి మల్లేశం, గొర్రె గట్టు సంగమేశ్వర్, మాజీ సర్పంచులు, శంకర్, బాగన్న పార్టీ నాయకులు కుతుబుద్దీన్, భద్రప్ప, దత్తు, ముదిరాజ్, విఠల్, విశ్వనాథం, విఠల్ రెడ్డి, బోయిని రాజు, నవీన్, గొర్రె గట్టు రవి, కుమ్మరి దత్తు, ఇబ్రహీంపూర్ మహేష్, ఆలయ కమిటీ పెద్దలు, కార్యకర్తలు, బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





మైనర్లు బైక్ నడిపితే తల్లిదండ్రులపై కఠిన చర్యలు

తాండూర్, సెప్టెంబర్ 12, వార్త దీపిక న్యూస్ :

పట్టణంలో పెట్రోలింగ్లో భాగంగా డీఎస్పీ నర్సింగ్ యాదవ్ మాట్లాడుతూ మోన్నా అంతారంలో జరిగిన ప్రమాదంలో మైనర్ విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం జరిగింది ఇంకా ఇద్దరు మైనర్ విద్యార్థులకు కాళ్లు చేతులు విరగడం, తెలిసిందే రోజు ఎక్కడపడితే అక్కడ ట్రిపుల్ రైడింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ మైనర్లు బైక్లపై తిరగడం గమనిస్తున్నామని ఇలాంటి మైనర్లు దొరికినట్లైతే ముందుగా వారి తల్లిదండ్రుల పైన చర్య తీసుకోవడం జరుగుతుంది అదేవిధంగా అదే వ్యక్తి రెండోసారి దొరికినట్లయితే కేసు బుక్ చేసి జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు. తాండ్ర పట్టణంలో ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ఇలాంటి చర్యలను అరికట్టే ప్రయత్నం చేస్తున్నాము ఎవరు కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ చేయొద్దని డిఎస్పి పలుమార్లు సూచించారు.



ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

తాండూర్ సెప్టెంబర్ 12, వార్త దీపిక న్యూస్ :

ఈ నెల 5వ తేది సెప్టెంబర్ 5 సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకొని,తాండూర్ నియోజకవర్గము బషీరాబాద్, యాలాల్, పెద్దముల్ తాండూర్ నాలుగు మండలాల ఉత్తమ ఉపాధ్యాయులకు తాండూర్ తులసి గార్డెన్ లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఘనంగా సన్మానించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గం శాసనసభ సభ్యులు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా మేటి ఎన్ని టెక్నాలజీలు వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థులకు సంస్కారవంతులుగా తీర్చిదిద్దే మార్గదర్శకంగా ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నిరజబాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, కర్ణం పురుషోత్తం, తాండూర్ వివిధ వార్డు కౌన్సిలర్లు, 4 మండలాల విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘాలు, నాలుగు మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి



వివిధ కుల, మతాలకు చెందిన పెద్దలతో సమావేశం

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, సెప్టెంబర్ 12, వార్త దీపిక న్యూస్ :

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. శనివారం జిల్లా జెడ్.పి. కార్యాలయంలో వివిధ కుల, మతాలకు చెందిన పెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రజలు ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవిస్తూ మత సామరస్యాన్ని కాపాడాలని అన్నారు. నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేలా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల వారీగా వివిధ మతాలకు చెందిన పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా పాటలు, వ్యాఖ్యలు చేయకూడదని, తప్పుడు ప్రచారాలకు దూరంగా ఉండేలా యువతకు సూచించాలని అన్నారు. ఈ పోర్టల్ ద్వారా మండపం వివరాలు, నిమజ్జనం తేదీ, నిమజ్జనానికి వెళ్లే మార్గం తదితర వివరాలను ముందస్తుగా నమోదు చేయాలని సూచించారు. వినాయక ప్రతిష్ఠాపన కోసం ఏర్పాటు చేసే మండపాలను రహదారులపై నిర్మించకుండా ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భద్రతా దృష్ట్యా ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏలాంటి పరిస్థితుల్లోనూ అధిక శబ్దంతో కూడిన లౌడ్స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని, నిబంధనలకు అనుగుణంగా మైకులు, స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేస్తే మండప నిర్వాహకులతో పాటు డీజే యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత సోషల్ మీడియా ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దని, నిర్ధారణ లేని ఫార్వర్డ్ మెసేజ్లను ఇతరులకు పంపకుండా జాగ్రత్త వహించాలని ఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు, వ్యాఖ్యలు చేయవద్దని, అనుమానాస్పద సమాచారం లేదా తప్పుడు ప్రచారం కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వివిధ మతాల పెద్దలు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు ఇబ్బంది కలగకుండా అత్యవసర లైట్లను అందుబాటులో ఉంచుకోవాలని, మండపాల వద్ద వీడియో రికార్డింగ్ కోసం సీసీటీవీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, గణేష్ మండపాల వద్ద లక్కీ డ్రాలు నిర్వహించడం లేదా బలవంతంగా చందాలు వసూలు చేయడం చేయరాదని, గణేష్ మండపాల వద్ద మత్తు పదార్థాలు సేవించడం, జూదం ఆడటం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని, గణేష్ మండపాల వద్ద ఇసుక బస్తాలు, నీటి డ్రమ్ములు తదితర అగ్నిమాపక, అగ్ని నిరోధక సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని, రాత్రి సమయంలో తనిఖీ కోసం వచ్చే పోలీసు అధికారులకు మండప నిర్వాహకులు, వాలంటీర్లు పూర్తిగా సహకరించాలని, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భారీ పరిమాణంలో విగ్రహాలను ఏర్పాటు చేయడం వల్ల నిమజ్జనం సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, విగ్రహాల పరిమాణంలో సాధ్యమైనంతవరకు పరిమితులు పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో లేదా ఏదైనా సమాచారం ఉన్నప్పుడు డయల్-112కు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్కు వెంటనే సమాచారం అందించాలని కోరారు.



జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారం..!



జిల్లా సేవాదికార సంస్థ భవానీ చంద్ర

సంగారెడ్డి, సెప్టెంబర్ 12, వార్త దీపిక న్యూస్ :

సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం 3వ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం, ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి కమ్ చైర్పర్సన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జి. భవాని చంద్ర ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సెషన్స్ జడ్జి జి. భవాని చంద్ర, సభను ఉద్దేశించి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు తమ వివాదాలను పరస్పర అంగీకారంతో సత్వరంగా పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు సంతృప్తికరమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. 1వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె. జయంతి కూడా ఈ కార్యక్రమంలో సభను ఉద్దేశించి ప్రసంగించారు. లోక్ అదాలత్ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలు తమ మధ్య ఉన్న రాజీ పడదగిన వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సత్వర న్యాయం అందించడంలో లోక్ అదాలత్లు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆమె తెలిపారు.లోక్ అదాలత్లో వివిధ రకాల సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్ వాహన ప్రమాద పరిహారం, కుటుంబ వివాదాలు, ఇతర రాజీ పడదగిన కేసులను సత్వరంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిష్కరించబడిన కేసులకు సంబంధించి కక్షిదారులకు అవార్డులను అందజేశారు. అవార్డులు అందుకున్న కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా తమ కేసులు సత్వరంగా పరిష్కారం కావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల కక్షిదారులకు సమయం మరియు న్యాయ వ్యయం ఆదా కావడంతో పాటు, దీర్ఘకాలిక న్యాయ వివాదాలకు ముగింపు పలికి ఇరుపక్షాలకు సంతృప్తికరమైన పరిష్కారం లభిస్తుందని న్యాయమూర్తులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందించడం, ప్రజలకు సత్వర న్యాయం అందించడం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్లో పరిష్కరించబడిన కేసుల వివరాలు క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు 3050, సివిల్ కేసులు 24, మోటారు వాహన ప్రమాద పరిహారం కేసులు 15 , రూ. 1,56,85,000లు, బ్యాంకు రికవరీ కేసులు 230 , రూ.2,77,0216లు, సైబర్ క్రైమ్ కేసులు 70 కేసులు, రూ.3,37,606లు, ఎలక్ట్రిసిటీ కేసులు 236లు
మొత్తం పరిష్కరించబడిన కేసులు 3625లు, ఈ కార్యక్రమంలో 1వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె. జయంతి, 3వ అదనపు జిల్లా ఽ సెషన్స్ జడ్జి డి. మాధవి కృష్ణ, 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి సతీష్ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి డి.వి.ఆర్. తేజు కార్తీక్, అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె. ధనలక్ష్మి, ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి టి. దుర్గా రాణి, ప్రత్యేక ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి అమిసి జాజియాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. సంజీవ రెడ్డి, గవర్నమెంట్ ప్లీడర్ జి. ప్రభు ధాన్యం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్య, ఆందోల్ ఆర్డీఓ రాజు, పాల్గొన్నారు.అదేవిధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్ లో మాక్ అసెంబ్లీ

ఎమ్మెల్యే మాణిక్ రావు

సంగారెడ్డి, సెప్టెంబర్ 12, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ భవన్లో బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన మాక్ అసెంబ్లీ రాజకీయ వర్గాల్లో విశేష ఆసక్తిని రేకెత్తిస్తోంది. అసెంబ్లీలో గొంతు నొక్కుతున్నారనే నిరసనతో పార్టీ కార్యాలయంలోనే సాగిన ఈ సమాంతర సభలో నాయకుల అభినయ నైపుణ్యం అందరినీ ఆకట్టుకుంది.?ఈ మాక్ అసెంబ్లీలో ఎమ్మెల్యే మాణిక్రావు స్పీకర్ గా వ్యవహరించిన తీరు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నిజమైన శాసనసభలో స్పీకర్ ఎలా వ్యవహరిస్తారో, సభను ఏ విధంగా ఆర్డర్లో పెడతారో ఆయన అంతకంటే అద్భుత ప్రదర్శనతో అందరిని ఆకట్టుకున్నారు. సభా నిర్వహణపై ఆయనకు ఉన్న అవగాహన, ప్రతిక్షణం సభను అదుపులో ఉంచుతూ సభ్యులను నియంత్రించిన తీరు ఎంతో గొప్పగా సాగిందని, ?మాణిక్రావు అచ్చమైన స్పీకర్లా గంభీరంగా, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించిన విధానం పార్టీ శ్రేణులను మంత్రముగ్ధులను చేసింది. ఆయన హావభావాలు, సభను నడిపిన శైలిని చూసిన ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే, శాసనసభకు ఆయనే అధికారిక స్పీకర్గా బాధ్యతలు చేపట్టడం ఖాయమంటూ జోరుగా చర్చించుకుంటున్నారు. ?ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు చేపట్టిన ఈ మాక్ అసెంబ్లీ.. కేవలం నిరసనగానే కాకుండా, బిఆర్ఎస్ నాయకుల సమర్థతకు, పరిణతికి నిదర్శనంగా నిలిచింది.



TGTEL/26/A5513 వార్త దీపిక

ప్రతి నెల రెండవ శనివారం అన్నధానం

సంగారెడ్డి సెప్టెంబర్ 12, వార్త దీపిక న్యూస్ :

ప్రతి నెల రెండవ శనివారం లో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో అన్నధానం చేయడం జరుగుతుంది. ఇందులో ప్రత్యేకత ఎక్కడ కూడ ప్లాస్టిక్ వాడకం లేకుండా స్టీల్ ప్లేట్స్ భోజనం పర్యావరణం కాపాడుకుంటూ ఉండాలని దీన్ని అందరూ పాటించాలని గుడి అన్నప్రసాద సభ్యులు తెలిపారు. గత 16నెలలుగా జరుగుతున్న ఈ అన్నప్రసాదం దిగ్విజయంగా సాగుతుందని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వినాయక చవితి పండుగ శేరికర్ గురునాథ్ బీజేపీ సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో 33వార్డు రెవెన్యూ కాలనీ గుడిలో మట్టి వినాయకులు పంపిణి జరిగింది పర్యావరణం కాపాడాలి మట్టి వినాయకులు పూజ చేయాలి చెరువులు కుంటలు కలుషితం చేయొద్దని గురునాథ్ అన్నారు. గత 5సంవత్సరాలనుండి పంపిణి జరుగుతుంది ప్రజల నుండి మంచి స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ పంతులు, ప్రభాకర్ రెడ్డి, దుర్గయ్య, మహేందర్ రెడ్డి, శ్రీరాంలు, ఏడుకొండల సూరి, సుభాష్, కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, రాజిరెడ్డి,శ్రీనాథ్, శ్రీనివాస్ పాలుగోన్నారు.



గడిలో హైమాస్ట్ లైటుల ఏర్పాటు

ప్రజల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యత

మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్

జహీరాబాద్, సెప్టెంబర్ 12, వార్త దీపిక న్యూస్ :

మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులోని గడి ప్రాంతంలో ప్రజల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైమస్ట్ లైట్ కోసం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మరియు వార్డు కౌన్సెలర్ అతిక్ హక్కని కలిసి లైటును ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ముఖ్యంగా రాత్రివేళలో ప్రజలు, మహిళలు, వృద్దులు, విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా వీధుల్లో తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. హైమాస్ట్ లైట్ ఏర్పాటు వల్ల ఘడి ప్రాంతంలో రాత్రి సమయంలో వెలుతురు మెరుగుపడి, ప్రజల రాకపోకులకు మరింత సౌకర్యం కలగడంతో పాటు భద్రత కూడా పెరుగుతుందని తెలిపారు. అలాగే గణేష్ నవ రాత్రులను దృష్టిలో ఉంచుకొని, మున్సిపల్ పరిధిలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి దశలవారీగా విద్యుత్ దీపాలు, హైమస్ట్ లైట్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చైర్మన్ తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. హైమాస్ట్ లైటు ప్రారంభం కావడంతో వార్డు కౌన్సిలర్ అతిక్ హక్కని, వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో రాత్రివేళలో వెలుతురు సమస్యకు పరిష్కారం లభించిందని చైర్మన్ మహమ్మద్ యూనుస్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అతిక్ హక్కని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు నాగిరెడ్డి, పాండు, వాజీద్ హక్కని, పవన్, భవాని, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.





మంథనిలో మంత్రి క్యాంపు కార్యాలయాన్ని రైతులతో కలిసి ముట్టడించిన బీజేపీ నాయకులు

-24గంటల విద్యుత్ ఇస్తామన్న హామీ అమలు చేయాలి

-మంథని విద్యుత్ డిఈ కి వినతిపత్రం అందించిన బిజెపి నాయకులు, రైతులు

వార్త దీపిక న్యూస్ :

బీజేపీ రాష్ట్ర కమిటీ పార్టీ పిలుపు మేరకు, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమం లో భాగంగా శనివారం మంథని పట్టణంలో ని అంబేద్కర్ చౌక్ వద్ద రైతులతో కలసి బీజేపీ నాయకులు మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మంథని పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు.ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, చల్లా నారాయణ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు గోస కనిపించడం లేదా, 24గం కరెంటు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చి ఇప్పుడు కేవలం 7గంటల కరెంటు ఇవ్వలేని పరిస్థితి ఉంది అంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ధోరణి అర్థం అవుతుందన్నారు.ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వంత నియోజకవర్గం లో రైతులు నీళ్ల కోసం ధర్నా చేయడం సిగ్గు చేటని, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు.వెంటనే రాజీనామా చేయాలనీ, బీజేపీ పాలిత ప్రాంతాలను చేసి సిగ్గు తెచ్చుకోవాలి అన్నారు వెంటనే రైతులకు 24గంటల నాణ్యమైన కరెంటు అందించాలని లేదంటే మంత్రి క్యాంపు ఆఫీస్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు అనంతరం విద్యుత్ అధికారులకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండపక సత్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, నియోజకవర్గ కో కన్వీనర్ నంపెల్లి రమేష్,మండల అధ్యక్షులు విరబోయిన రాజేందర్, సబ్బాని సంతోష్,కొయ్యడ సతీష్, పగే రంజిత్, కొండ్రు లక్ష్మణ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎల్మా సదానందం,సీనియర్ నాయకు రాపర్తి సంతోష్,మట్ట శంకర్, మళ్లారపు అరుణ్,చిలువేరు సతీష్, విశ్వాతేజ, సామల అశోక్, భానుప్రకాశ్, తొట్ల రాజు రైతులు , సాదుల రమేష్, జాన్నే శ్రీనివాస్, రాజు,ఓదెలు, వెంకటేష్, రామూర్తి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సంది మార్గమే సరియైన మార్గం

సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది

వార్త దీపిక న్యూస్ :

సంది మార్గమే సరియైన మార్గమని సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది అన్నారు. శనివారం మంథని కోర్టు ప్రాంగణం లో జాతీయ లోక్ అదాలత్ లో సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది మాట్లాడుతూ పరస్పర అంగీకారంతో కేసుల పరిష్కారం చేసుకొని సమయాన్ని అధా చేసు కోవాలని, దీని ద్వారా తీవ్ర మైన నేరాలకు సంబంధించిన కేసుల త్వరగా పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి, ద్వితీయ శ్రేణి న్యాయ మూర్తి అనురాధ, ఏ పీపీ అర్ధ కుమార్, ఎ జీపీ ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదులు రఘోత్తం రెడ్డి, సువర్ణ చంద్ర శేఖర్, కటకం శ్రీనివాస్, శశి భూషణ్ కాచే,అశోక్ రెడ్డి, వ్యాస్,మంథని ఎస్ఐ సందీప్,బ్యాంక్ అధికారులు, కక్షి దారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

తెలంగాణల సకల జనుల సమ్మెకు 15 ఏళ్లు

- ఏకబిగిన 42 రోజుల పాటు జరిగిన సమ్మె

- తెలంగాణ ప్రజల్లో నాటుకుని ఉన్న ప్రత్యేక రాష్ట్ర కాంక్షను బలంగా చాటిన సమ్మె





వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ ఉద్యమంలో సకల జనుల సమ్మెకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. తెలంగాణ వ్యాప్తంగా దాదాపుగా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన సేవలు నిలిచిపోయాయి. ఉద్యోగులంతా రోడ్డెక్కారు. ఏకబిగిన 42 రోజుల పాటు జరిగిన ఈ సమ్మె తెలంగాణ ప్రజల్లో నాటుకుని ఉన్న ప్రత్యేక రాష్ట్ర కాంక్షను బలంగా చాటింది. ప్రభుత్వ కార్యాలయాలతో పాటుగా ప్రభుత్వ రవాణా సేవలు కూడా నిలిచిపోయాయి. ప్రైవేట్ రవాణా కూడా ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయవాదులు, సింగరేణి కార్మికులు, ఉపాధ్యాయులు, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులు, విద్యుత్ సంస్థ ఉద్యోగులు సకలజనుల సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె జరిగి నేటికి సరిగ్గా 14 ఏళ్లు నిండాయి. 2011 సెప్టెంబర్ 13న ప్రారంభమైన ఈ సమ్మెలో ఉద్యోగ సంఘాల నేతలే కీలక భూమిక పోషించారు. సెప్టెంబర్ 12న రాత్రి 12 గంటలకు సమ్మె ప్రారంభమైంది. ఇందులో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విధులకు హాజరుకాని ఉద్యోగుల వేతనాల్లో కోత విధించేందుకు జీఓ నం. 177ని అమ లు చేయాలని పేర్కొన్నారు. జేఏసీలోని ప్రధాన భాగస్వా మ్య పక్షాలైన టీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీలు సమ్మెకు మద్దతిచ్చాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ సంఘాలు సమ్మె సైరన్ మోగించడంతోపాటు దాదాపు 4 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. వీరితోపాటు విద్యార్థులు, కవులు, కళాకారులు ఇలా యావత్ తెలంగాణ సమ్మెలో పాల్గొన్నది. ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు పడ్డాయి. బడిపిల్లలు రోడ్డెక్కారు. ఉద్యోగులు విధులు, లాయర్లు కోర్టులు బహిష్కరించారు.

మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించిన పద్మశాలి సంఘం

వార్త దీపిక న్యూస్ :

హైదరాబాద్‌లోని పద్మశాలి భవన్‌లో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం, అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా ఎన్నికైన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన వొడ్నాల శ్రీనివాస్ ని పద్మశాలి సంఘం నాయకులు, కుల బాంధవులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు పద్మశాలి సంఘం ప్రముఖులు,్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వీరభద్ర అనిల్ కుమార్, కార్పొరేషన్ చైర్మన్ గూడెం వెంకటరమణ, ఎల్. రమణ, గుండు సుధారాణి, పెద్దపల్లి జిల్లా చైర్మన్ వలస నీలయ్య, మాజీ సర్పంచ్ మేముని వెంకటటేస్వామి, సర్పంచ్ నాగుల రాజయ్య, మాజీ సర్పంచ్ రామ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించిన పద్మశాలి సంఘం నాయకులకు, కార్యక్రమంలో పాల్గొన్న కుల బాంధవులకు వొడ్నాల శ్రీనివాస్ కృతజ్ఞతాభినందనలు తెలిపారు.



సుద్దాలకు 'తెలంగాణ తెలుగు తేజం' పురస్కారం

సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం

ఈనెల 22న కరీంనగర్‌లో పురస్కారం ప్రదానం

వార్త దీపిక న్యూస్ : :

తెలుగు సాహిత్య రంగంలో ప్రముఖ కవి, జాతీయ స్థాయి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కారం-2026కు ఆయనను ఎంపిక చేశారు. తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ ఏటా ప్రదానం చేస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈసారి సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. పురస్కార కమిటీ చైర్మన్, అవార్డు వ్యవస్థాపకుడు కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. తెలుగు భాష, సాహిత్యానికి విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో తెలంగాణ తెలుగు తేజం పురస్కారాన్ని ఏటా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కవిగా, సినీ గేయ రచయితగా సుద్దాల అశోక్ తేజ తెలుగు భాషకు విశిష్టమైన సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే సాహిత్య, సినీ రచనలతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజకు పురస్కారాన్ని అందజేయనున్నారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టిబిడ్డలు అందించిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పురస్కార కమిటీ ప్రతినిధులు తెలిపారు. భాషా పరిరక్షణ, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న రచయితలు, కవులుద్ర వేశారు. సామాజిక అంశాలు, తెలంగాణ జీవన విధానం, ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించే అనేక రచనలకు ఆయన కలం అందించారు. ఆయన సాహిత్య, సినీ ప్రస్థానాన్ని గుర్తిస్తూ తెలంగాణ తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్‌లో ఈ నెల 22వ తేదీన జరగనున్న పురస్కార ప్రదానోత్సవంతో సుద్దాల అశోక్ తేజకు ఈ గౌరవం అధికారికంగా అందనుంది. ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, భాషాభిమానులు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది.

Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984